మీకు కోపం వచ్చి నాతో మాట్లాడటంమానేశారు. ఫలహారం చేయనని, బట్టలు కట్టుకోనని అలిగారు. అమ్మ నా మీద కోప్పడింది. నేను ఏడుస్తూ పడుకున్నాను.

అప్పుడు నాన్న దాలయ్య బండి కట్టించి ఎద్దులబండిమీద పెనుగొండ మనిద్దర్నీ సినిమాకు పంపించాడు. అప్పుడు మనం చూసిన బాలరాజు సినిమాలో బాలరాజులానే మీరు నాక్కనిపించే వారు.

నేను పూలు కోసుకోవాలని వెళ్ళి గుళ్ళో తోటలో చెరువు మెట్లమీద మా స్నేహితురాలితో కబుర్లు చెబుతూ కూర్చున్నానని నా చెవి మెలిపెట్టారు. గుర్తుందా?

మీరు దొంగతనంగా సిగరెట్ల కోసం కాలవ గట్టంట పై ఊరికి షికారుగా వెళ్ళి ఎంత చీకటి పడ్డా రాకపోయేసరికి నా గుండె గబగబ ఎలా కొట్టుకుందనీ? ఆ కాలవ గట్టంట నా మనసు మీ వెనకాలే ఎలాపరిగెట్టిందో నే నిప్పుడు చెప్పలేను.

కొత్తబట్టలు పట్టుకొని నన్ను రాసుకుంటూ మీరు వెళ్ళినప్పుడు. నా తలలోని మల్లెచెండును మీరు కొంటిగా లాగి నా జడను పట్టుకు గుంజినపుడూ, నా నెత్తిమీద పన్నీరుజల్లి. నా మెడకు మంచిగంధం పూసి, నా బుగ్గను చిటికేసి, వెళ్ళి వస్తానని మీ రన్నపుడూ నిజంగా పండగ ఇంత తొందరగా అయిందేమా అనిపించి మీరు వెళ్ళిపోతున్నందుకు నాకళ్ళలో నీళ్లు చిమ్మి నాకు చెప్పరాని ఉడుకుమోతుతనం వచ్చేసింది.

ఏమండీ మళ్లీ అలాటి ఉగాది మనకు వస్తుందంటారా?

పోన్లెండి మన అమ్మాయికి పెళ్ళవుతుంది. మనింటికి అల్లుడొస్తాడు. చిన్న చిన్న పేచీలు. కొసరికొసరి అలగటాలూ అవన్నీ చూస్తూ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటూ కలగానైనా బ్రతకవచ్చు!

ఉమ, భారతి, సీత, సుబ్బు, సీను, రాము యింతమంది పుట్టుకొస్తారని కలగన్నామా? ఈ మొహాలన్నీ నవ్వుతూ కలకలా తిరుగుతూంటే జీవితం చేదుచేదుగా ఉప్పుప్పగా పుల్లగా తీయగా ఎన్నో ఎన్నెన్నో మధుర స్మృతుల్ని రేపుతుంది.

ఏవండీ ఆ యిరవై ఏళ్ళక్రితం వచ్చిన ఉగాది మళ్ళీ ఎలా వస్తుంది?

# రేపటి ఆకాశంలో ఆశల హరివిల్లు

వాడెవడో సప్తసముద్రాల్ని ఈదేట్ట: ఈ సంసారం ఈదమనండి చూస్తాను?తెచ్చి పడెయ్యటం తెచ్చిపడేస్తారు ఉన్నదాంట్లో... యాచాకిరీ ఎవరు చేస్తారు? తెల్లారుతోందంటే భయం వేస్తోంది? పనివాళ్ళు మరీ బరి తెగించి పోయారు. ఓ రోజు వస్తే ఓరోజు రారు. ఆ చిన్న ముండ నిన్నగాక మొన్న పుట్టింది. నాలుగు గంటలకే లేచి కూర్చుంటుంది. "తై"మని

ఆడుతూ - మీకేం చెబుతారు? అసలు తెల్లారే ముందు ఒకటి, రెండు గంటలు ఏం నిద్రపడుతుందో అదే నిద్ర: ఇదిరాత్రి రెండు మూడు సారులు పాలకని లేస్తుందా.... మీరేమో రోడ్లని కొలవటం పూర్తి చేసి ఏ అర్ధరాత్రో అపరాత్రికో గాని ఇంటికిచేరుకోరాయె. పొద్దస్తమానూ స్నేహితుల్తో ఆ కిల్లీ కొట్టుదగ్గర యీ సందుమొగలోనూ నిలబడి సొళ్ళు కబుర్లు చెబితే పుణ్యమా పురుషార్థమా? మనకో కానీ లాభించే పనిఏదన్నా చేయమంటే మీకువొళ్లు ఒంగుతుందీ? మీ తెలివి తక్కువతనాన్ని కనిపెట్టి ఆ స్నేహితులు నిలబెట్టేస్తున్నారు. ఇంట్లో ఆడాళ్లు యింత తిని కాస్త వొళ్లు వాల్చుకోవాలా? కళ్ళలో వొత్తు లేసుకొని కూర్చోవటం ఎవరి తరం బాబూ? మీరే యిల్లు పట్టకుండా తిరిగితే యిహ పిల్లల మాటేం చెప్పను? పిల్లలు నామాట ఎందుకన్నా వింటారా?ఆ పెద్దది - దెయ్యం ప్రాణం పోతున్నా ఇక్కడ పుల్లతీసి అక్కడపెట్టదు. తిన్న కంచం కడుక్కోదు. ఆ వార పత్రికలూ, జ్యోతులూ, దిబ్బాదిరుగుండం పట్టుకుని కిటికీలో కూర్చుంటుంది. అందులో దీనికేమిటి బోధపడుతుంది. ఎందుకా దిక్కుమాలిన పుస్తకాలు చదవటం? మీకు చెబితే మీరేమో నవ్వుతారాయె: వాళ్ళను నెత్తికెక్కించుకుని చనువిచ్చేస్తే యిహ పిల్లలెట్లా బాగుపడతారండీ? మరోదుర్గుణం - మీరు పిల్లలకి డబ్బులిస్తారు. అలా ఎంతడిగితే అంత యిస్తే వాళ్ళకు డబ్బు విలువ వుంటుందా?

మీకు జ్ఞాపకం లేదేమో కాని నేను హైస్కూలుల్లో ఫస్టు పారం చదివే రోజుల్లో కానీకి మూడు దమ్మిడీలు-ఓదమ్మిడీకి రెండు మిరపకాయబజ్జీలు కొనుక్కొని రెండవ దమ్మిడీ పెట్టి జీళ్లుకాని, కొబ్బరిలవుజుండకాని కొనుక్కుని తిని మూడో దమ్మిడీ దాచుకునే దాన్ని. పంపు క్రింద మంచి నీళ్లు త్రాగి సుబ్బారాయుడి చెరువు గట్టున చాలాసేపు ఆడుకునే వాళ్ళం మేం ఆడపిల్లల మందరమూ. సుబ్బారాయుడి చెరువు గట్టున గుడి, కళ్యాణ మంటపం, ఒకవైపున తాటిచెట్లు ఆవైపున రోడ్డు దాటితే కాలువ-ఆ కాలువ ఎండిపోయాక అందులోదిగి నీళ్లు చిమ్ముకుంటూ ఆటలాడుకునే వాళ్ళం. ఆ ఇసుకలో చెలమలుతీసి ఆ నీళ్ళు తాగి బట్టలన్నీ తడిపేసుకుని దొంగ దారిన నెమ్మదిగా దొడ్లోకి వస్తే అక్కడ మా అమ్మ లోకభీకరావతారం ఎత్తి వీపులు చీరేసేది. భయభక్తులంటే అవి : మీరూ ఉన్నారు ఎందుకూ? చదువుకుంటూంటే పిల్లలు బంయ్ మంటూ రేడియో పెడతారు. ఈ రేడియో వోటమ్మా దిక్కుమాలిన గోల-పాడు సినిమా పాటలు: విందామంటే పాటలు ఒక అందమా ఏడుపా? పిల్లలకు పరీక్ష రోజులా... సినిమాలు, రేడియోలు, పుస్తకాలు, నవలలు అవన్నీ పెట్టుకు కూర్చుంటే బోలెడుడబ్బు తగలేసి ఏడాది పొడుగునా చెప్పించామే చదువులు?పరీక్షలు గుడ్డుసున్నా చుట్టేస్తే. మనం సామాన్య సంసారులమాయె - పిల్లలు పాడయాక ఇక మనకు చివరకు మిగిలే దేమిటి?

అబ్బో : ఏమిటలా చూస్తారు? నేను చదువుకోలేదని కాని నాకన్నీ తెలుసు:

అసలు మీ మూలకంగానే నేనిలా ఉన్నాను. మీది కావలసిన సంబంధం గదా అని వెనకాముందు చూడకుండా మానాన్న పెళ్ళి పెళ్ళి అని వేపుకుతిని నాకు పన్నెండేళ్ళకే చవగ్గా పెళ్ళి చేసేశాడు.

లేకపోతే నేనసలు యం.బి.బి.యస్ చదివేదాన్ని; ఈ ఇంగ్లీషు చదువుకున్న మీ ఆఫీసులోని అమ్మాయిలకు మల్లే "ఫీస్-పాస్" మంటూ బొట్లేరు ముక్కలు పేలేదాన్ని.

అప్పుడు నామాటల్ని - నన్నూ యింత తేలిగ్గాకొట్టిపారెయ్యలేరు మీరు. మీ ఆఫీసులో పనిచేస్తూ ఉంటుందట - కిరస్తానీపిల్ల - నల్లగా చింతమొద్దులా వోగౌను చుట్టేసుకుని ఎత్తుమడమల జోళ్ళేసుకుని ఓ పెనసలు ముక్కా అప్పడాల కట్టలా చిన్న పుస్తకము పట్టుకొని మొగాళ్ల ముందు కూర్చుని అవతల వాడినోట్లోంచి ఏ ముక్క ఊడిపడితే అది పుటుకూ పుటుకూ రాస్తుందిట (వాడిమొహంకేసి చూస్తూ సిగరెట్టు పొగపీలుస్తూ). అదేం ఉద్యోగమో: అది బజారులో కనిపించి "హవుడుయుడూ" అంది నీపిండాకూడు తెలుగు మాట్లాడు అందా మన్నంత కోపం వచ్చింది. కానీ బావుండదని చిన్న నవ్వునవ్వేసి పిల్లల్నీడ్చుకుంటూ రిక్షాలోకొచ్చి పడ్డాను.

అయితే చదువుకున్న ఆడవాళ్లు మాచదువుకోని స్త్రీలను చూసినంత హీనంగా మీచదువుకున్న మగాళ్లు చదువుకోని పురుషులను చూడరు.

చదువుకోని ఆడవాళ్ళతరం నాతోటే ఆఖరవుతుందిలెండి. రేపు నా పిల్లలు నేను పడేపాట్లు పడరు:

# పుస్తకాలు - పరధ్యాస

ఏమిటండీ వెతుకుతున్నారు? మీ పుస్తకాలుకాని, మీ కాగితాలుకానీ ముట్టుకుంటే వొట్టు! ఒకచోట పెట్టి ఒకచోట వెతుకుతారు. అయినా ఇంటినిండా ఆ దిక్కుమాలిన పుస్తకాలొకటమ్మా! అలమర్లన్నీ నిండిపోతున్నాయి. బల్లమీద-గూళ్ళ లోనూ, కిటికీలోనూ, పక్కలమీద నా నెత్తిమీద ఎక్కడ పడితే అక్కడ పుస్తకాలు; ముఖ్యమైన కాగితాలు ఉత్తరాలు చదువుతూ ఏదో పుస్తకంలో పెట్టేసి మర్చిపోతారు కనపడకపోతే నా మీద ఎగిరిపోతారు. ఆడదానికి బద్ధకమూ, మగవాడికి పరధ్యాసా పనికిరాదమ్మా!

నేను మీ బల్ల కెలికేసానంటున్నారా? మీ పెన్ను, తాళం చెవులూ కళ్ళజోడూ కనపట్టంలేదా? పిల్లలున్న ఇల్లు -ఎక్కడ వస్తువు అక్కడ ఎలా వుంటుంది చెప్పండి? మీ కలంతో రాయవద్దని ఎన్నిమాట్లు చెప్పాననుకున్నారు? అయినా వాళ్ళ పెన్నులు కనిపించకపోతే బల్లమీద ఎదురుగుండా వున్నదికదా అని మీ పెన్ను రాము రమ బళ్ళోకి పట్టుకుపోతారు. నాన్నగారి వస్తువులు ముట్టుకోకూడదన్న జ్ఞానం వాళ్ళకి ఎప్పుడొస్తుందో .... అదిగో కళ్ళజోడు ఇక్కడ పెట్టారు. అక్కడ వెదుకుతున్నారు. ఈ పుస్తకాలమధ్య పడిపోయింది. అవతల కుంపట్లోచారు మరిగి